క్లుప్తంగా

సత్యమ్మ అమ్మవారిని దర్శించుకున్న వసంత



నందిగామ టౌన్: మండలంలోని అంబారుపేట గ్రామంలో వేంచేసియున్న సత్యమ్మ అమ్మవారిని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ దంపతులు సోమవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, అర్చకులు ఆయనకు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయనకు అమ్మవారి ప్రసాదాలు, జ్ఞాపికను అందజేశారు. ఈవో హరిగోపీనాథ్, నాయకులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలకు 60 దరఖాస్తులు

తొర్రకుంటపాలెం(జగ్గయ్యపేట): మద్యం దుకాణాలకు ఈ నెల ఒకటి నుంచి సోమవారం వరకు 60 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ సీఐ గురవయ్య తెలిపారు. ఈ నెల తొమ్మిదిన సాయంత్రం లోగా దరఖాస్తులకు గడువు ముగుస్తుందని తెలిపారు.

మద్యం దుకాణాలకు 75 దరఖాస్తులు

నందిగామ టౌన్: నందిగామ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మద్యం దుకాణాలకు 75 దరఖాస్తులు అందాయని ఎక్సైజ్ సీఐ బంగార్రాజు పేర్కొన్నారు. స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌లో సోమవారం ఆయన మాట్లాడుతూ మొత్తం 16 దుకాణాలకు గాను 75 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఈ నెల తొమ్మిదిన సాయంత్రం ఐదు గంటలతో దరఖాస్తుల స్వీకరణ గడువు ముగుస్తుందని తెలిపారు.

9 లోగా దరఖాస్తు చేసుకోవాలి

కంచికచర్ల: ఈ నెల 9వ తేదీ సాయంత్రం ఐదు గంటలలోపే దరఖాస్తు చేసుకోవాలని ఎక్సైజ్ సీఐ బేగం సోమవారం తెలిపారు. ఇప్పటివరకు కంచికచర్ల కార్యాలయానికి ఆఫ్‌లైన్ ద్వారా 20, ఆన్‌లైన్ ద్వారా 18 దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. కంచికచర్ల మండలంలో 5, వీరులపాడు మండలంలో 2 మొత్తం 7 మద్యం దుకాణాలను నోటిఫై చేశామని పేర్కొన్నారు. ఈనెల 9వ తేదీన దరఖాస్తు చేసుకునేవారి సంఖ్య ఎక్కువగా ఉంటుందని కాబట్టి 8వ తేదీలోగానే దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకునేవారికి తెలంగాణ డీడీలు కూడా పనిచేస్తాయని స్పష్టం చేశారు.

కొనసాగుతున్న గ్రామసభలు



జగ్గయ్యపేట: మండలంలోని చిల్లకల్లు, మల్కాపురం, రామచంద్రునిపేట, షేర్‌మహ్మద్‌పేట గ్రామాల్లో సోమవారం ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా సామాజిక తనిఖీ ఎస్ఆర్పీ పున్నమినాయుడు మాట్లాడుతూ 2023–24కు సంబంధించి ఉపాధి హామీ పనులు, కూలీల వేతనాలు. చేసిన పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఆర్పీలు రాజు, సత్యనారాయణ ఈసీ సంతోష్, ఆయా గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

వేడుకగా బతుకమ్మ సంబరాలు



పెనుగంచిప్రోలు: దసరా మహోత్సవల్లో భాగంగా గ్రామాల్లో బతుకమ్మ సంబరాలు వేడుకగా సాగుతున్నాయి. సోమవారం రాత్రి శ్రీధర్మపురి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో దసరా మహోత్సవాల్లో భాగంగా బతుకమ్మల పండుగ నిర్వహించి యువత, మహిళలు ఆటలు, పాటలతో గడిపారు. మండలంలోని లింగగూడెం గ్రామంలో మహిళలు, యువతులు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మ ఆట, పాటలతో, కోలాట నృత్యాలతో సరదాగా గడిపి బతుకమ్మలను వాగులో నిమజ్జనం చేశారు.

ఇసుక అక్రమంగా తరలిస్తున్న వాహనాలు స్వాధీనం

నందిగామ టౌన్: అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ఆరు వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ శాతకర్ణి తెలిపారు. పెనుగంచిప్రోలు మండలం శనగపాడు ఇసుక రీచ్ నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారనే సమాచారం వచ్చిందన్నారు. దీంతో పట్టణ సమీపంలోని అనాసాగరం వద్ద మూడు ఇసుక లారీలు, ఒక ట్రాక్టర్, రెండు కార్లను స్వాధీనం చేసుకుని ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామన్నారు. వాల్టా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నిరుపయోగంగా చెత్త సంపద కేంద్రాలు



ముచ్చింతాలలో ఉపయోగంలో లేని డంపింగ్ యార్డు



పెనుగంచిప్రోలు డంపింగ్ యార్డులో తయారవుతున్న వర్మీ కంపోస్టు

- మండలంలో 15 గ్రామాల్లో చెత్త సంపద కేంద్రాలు
- రెండు చోట్లే ఉపయోగంలో ఉన్న వైనం
- గ్రామాల్లో ఎక్కడి చెత్త అక్కడే

పెనుగంచిప్రోలు: పరిశుభ్రమైన గ్రామాలే లక్ష్యంగా గతంలో మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో సంపద తయారీ కేంద్రాలను(డంపింగ్ యార్డులు) ఏర్పాటు చేశారు. అయితే వీటి వినియోగంపై దృష్టి పెట్టక పోవటంతో కాల క్రమేణ అవి మొక్కుబడిగా మిగిలిపోయాయి. మండలంలో పెనుగంచిప్రోలు, కొణకంచి గ్రామాల్లో తప్ప అవి నిరుపయోగంగా మారాయి. గ్రామాల్లో పంచాయతీ సిబ్బంది చెత్తను సేకరించాక తడిచెత్త, పొడిచెత్తగా వేరుచేసి సంపద తయారీ కేంద్రాలకు తరలిస్తారు. అక్కడ తడి చెత్తలో వానపాములను వదిలి కుళ్లబెట్టటం ద్వారా వర్మీ కంపోస్టును తయారు చేస్తారు. ఆ ఎరువును రైతులకు విక్రయించటం ద్వారా గ్రామ పంచాయతీలు ఆదాయం సమకూర్చుకోవటమే కాకుండా గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగవుతుంది.

నిర్వహణ...

చెత్తను సేకరించేందుకు గ్రామాల్లో గ్రీన్ అంబాసిడర్లను ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఇళ్లలో తడి, పొడి చెత్తను వేరు చేసేందుకు గత ప్రభుత్వం కొన్ని గ్రామాల్లో ఇంటింటికి రెండు చొప్పున ప్లాస్టిక్ బకెట్లను కూడా సరఫరా చేసింది. అన్ని పంచాయతీలకు చెత్తను తరలించేందుకు రిక్షాలను కూడా అందజేసింది. అయితే వాటిల్లో చాలా ఈరోజున మూలన పడ్డాయి. వాటిని వదిలేయటంతో గ్రామాల్లో చెత్త నుంచి సంపద సృష్టి ఏమోగానీ గ్రామాల్లో చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. ప్రస్తుతం మండలంలో రెండు కేంద్రాలు తప్ప మిగిలినవి అన్నీ నిరుపయోగంగా ఉన్నాయి. పలు గ్రామాల్లో గ్రీన్ అంబాసిడర్ల జాడలేదు. మండలంలో 47 మంది గ్రీన్ అంబాసిడర్లు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం సగం మంది మాత్రమే పనిచేస్తున్నారని గ్రామస్తులు అంటున్నారు. కేంద్రాలను ఉపయోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. కేంద్రాల నిర్వహణపై మండల పరిషత్ అధికారులను వివరణకోరగా అన్ని డంపింగ్ యార్డులను పునఃరుద్ధరించటం జరుగుతుంది. ఎన్నికల సమయంలో గ్రీన్‌అంబాసిడర్ల సమస్య వచ్చింది. తిరిగి ఆసమస్యలను కూడా పరిష్కరిస్తామన్నారు.

నిధుల కొరత



గ్రామ పంచాయతీల్లో గ్రీన్ అంబాసిడర్ల జీతాలు చెల్లించేందుకు నిధుల కొరత ఉంది. 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి జీతాలు ఇవ్వాలని అధికారులు అంటున్నారు. ఆ నిధులు సాధారణ ఖర్చులకే సరిపోయే పరిస్థితి లేదు.

–నక్కా కమల, సర్పంచ్, గుమ్మడిదుర్రు

ఉపయోగించేందుకు ప్రయత్నిస్తాం



డంపింగ్ యార్డులు ఉపయోగంలోకి తీసుకు రావాలంటే గ్రీన్ అంబాసిడర్లకు సరైన జీతం ఉండాలి. గ్రీన్ అంబాసిడర్లు ఒక్కొక్కరికి రూ.6 వేలు మాత్రమే జీతం వస్తుంది. దీంతో గ్రామాల్లో చెత్త సేకరణలో ఇబ్బందులు వస్తున్నాయి. డంపింగ్ యార్డును ఉపయోగంలోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తాం.

–జిక్కులూరి రాంబాబు, సర్పంచ్, ముచ్చింతాల

అధునాతన వ్యవసాయంపై అవగాహన



తక్కెళ్లపాడులో ఆహార ఉత్పత్తులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

జగ్గయ్యపేట: రైతులకు అధునాతన వ్యవసాయ పద్ధతులపై అవగాహన కలిగించాలని కేవీకే కోఆర్డినేటర్ కృష్ణంరాజు తెలిపారు. మండలంలోని తక్కెళ్లపాడు, బలుసుపాడు, గరికపాడు గ్రామాల్లో ఇటీవల ఆచార్య ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయం పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు చేపట్టిన వ్యవసాయ క్షేత్ర స్థాయి పరిశోధనపై సోమవారం ఆహార ఉత్పత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యాధునిక పద్ధతుల్లో రైతులు సాగు చేస్తున్నారని చెప్పారు. రైతులకు మరింతగా వ్యవసాయ కళాశాల విద్యార్థులు అవగాహన కలిగించాలని చెప్పారు. ఆహార ఉత్పత్తులతో పాటు క్షేత్ర స్థాయి పరిశోధనలు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు సూర్యప్రకాష్, శ్రీనివాసరావు, శాస్త్రవేత్తలు ప్రభావతి, లక్ష్మి, పూర్ణిమ, ధనశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

వేలం పాట ద్వారా రూ. 6.22 లక్షల ఆదాయం

వేదాద్రి(జగ్గయ్యపేట): ప్రముఖ పుణ్యక్షేత్రం యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి వారికి పలు బహిరంగ వేలం పాటల ద్వారా రూ. 6.22 లక్షల ఆదాయం వచ్చిందని ఈవో సురేష్‌బాబు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో సోమవారం కొబ్బరి చిప్పలు పోగు చేసుకునేందుకు, తులసి పూలు అమ్ముకునేందుకు బహిరంగ వేలం నిర్వహించారు. ఈ పాటల్లో కొబ్బరి చిప్పలు పోగు చేసుకునేందుకు జగ్గయ్యపేటకు చెందిన గోపీ రూ. 3.12 లక్షలు, తులసి పూలు అమ్ముకునేందుకు దొండపాడుకు చెందిన సైదేశ్వరరావు రూ. 3.10 లక్షలకు పాట కైవసం చేసుకున్నట్లు తెలిపారు. ఈ పాటలు ఏడాది పాటు అమల్లో ఉంటాయని చెప్పారు. కొబ్బరిచిప్పలు పోగు చేసుకునే హక్కుకు నాలుగు సార్లు వాయిదా పడగా ఐదవ సారి నిర్వహించిన పాటల్లో గతేడాది కన్నా రూ. 1.48 లక్షల ఆదాయం తగ్గింది. ఈ కార్యక్రమంలో గ్రూపు టెంపుల్స్ ఇన్‌స్పెక్టర్ హరిదుర్గా నాగేశ్వరరావు, కేసీపీ ప్రతినిధి రాంప్రసాద్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ చట్టాలపై అవగాహన అవసరం



చిల్లకల్లు(జగ్గయ్యపేట): పంచాయతీ రాజ్ చట్టాలపై ప్రజా ప్రతినిధులు అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీవో కార్యాలయ ఏవో మాధవశర్మ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎన్నికైన ఉప సర్పంచులు, వార్డు సభ్యులు చట్టాలపై అవగాహన కలిగి ఉంటే అభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ముఖ్యంగా పంచాయతీ సమావేశాలు నిర్వహించి గ్రామాభివృద్ధికి కావాల్సిన అవసరాలను గుర్తించవచ్చని చెప్పారు. అదే విధంగా విధులు, బాధ్యతలు, పారిశుద్ధ్య, తదితర కార్యక్రమాల్లో పంచాయతీల పాత్ర ఎంతో కీలకమన్నారు. పన్నుల వసూళ్లపై దృష్టి సారిస్తే గ్రామాభివృద్ధికి దోహదపడతాయన్నారు. ట్రైనర్ శ్రీనివాసరావు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, కార్యదర్శులు జగ్గయ్య, సంక్రాంత్, శ్రవణ్, తదితరులు పాల్గొన్నారు.

మహా చండీదేవి.. నమోస్తుతే..

జగ్గయ్యపేట అర్బన్: శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఐదవ రోజైన సోమవారం పట్టణంలో పలు ఆలయాలలో అమ్మవారు మహాచండీదేవిగా దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఉదయం ఆలయాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. స్థానిక నకాశిబజారులో వేంచేసియున్న శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయంలో ఉదయం వేదపండితులు బ్రహ్మశ్రీ మహంకాళి రామప్పశాస్త్రి ఆధ్వర్యంలో శ్రీచండి మూల మంత్ర సహిత రుద్రహోమం అత్యంత వైభవంగా నిర్వహించారు. అద్దాలబజారులో ఉన్న శ్రీమహాలక్ష్మి అమ్మవారి వెండి దేవాలయంలో నిర్వహించిన సువాసినీ పూజలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. దుర్గాపురంలో ఉన్న శ్రీదుర్గామల్లేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారు శ్రీఅన్నపూర్ణదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. చెరువుబజారులో ఉన్న శ్రీరేణుకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శ్రీబాలాత్రిపురసుందరీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. అలాగే అద్దాలబజారులో ఉన్న శ్రీకన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో స్థానాచార్యులు పిల్లలమర్రి నాగకృష్ణశర్మ ఆధ్వర్యంలో పూజలు చేశారు. అమ్మవారు శ్రీగాయత్రీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే మార్కండేయ బజారులోని మండపంలో అమ్మవారు చండీదేవి అలకరణలో దర్శనమివ్వగా, సాయంత్రం భక్తులు నగర సంకీర్తన అత్యంత వైభవంగా నిర్వహించారు.

గాయత్రీదేవి ఆశీర్వదించు తల్లీ...

కంచికచర్ల: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో కనకదుర్గాదేవి అమ్మవారికి ఐదవరోజు సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక శివసాయిక్షేత్రంలో అమ్మవారు గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అదే విధంగా మహాలక్ష్మీ అమ్మవారి ఆలయంలో గజలక్ష్మీ దేవిగా అమ్మవారిని అలంకరించారు. వాసవికన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో లలితా త్రిపుర సుందరీదేవి అలంకారంతో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అదేవిధంగా పవుశుల ఆసుపత్రి రోడ్డు, ఫైర్‌స్టేషన్ రోడ్డులో అమ్మవారికి చలవ మండపాలు ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు. దుర్గాదేవిగా కొలువై ఉన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో కనక దుర్గాదేవి అమ్మవారికి అర్చకులు మహన్యాస పూర్వక అభిషేకాలు, నీరాజన మంత్రపుష్పములు, అష్టోత్తర పూజలు కుంకుమార్చనలతో ప్రత్యేక పూజలు చేశారు.



పేట లోని శ్రీకన్యకాపరమేశ్వరి ఆలయంలో గాయత్రీ దేవి అలంకరణలో అమ్మవారు



స్వర్ణకవచాలంకారంలో దర్శనమిస్తున్న నందిగామలోని మరిడీ మహాలక్ష్మీ అమ్మవారు

పెనుగంచిప్రోలు: దసరా నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఐదోరోజు సోమవారం తూర్పు బజారులో శ్రీదుర్గామల్లేశ్వరి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నవరాత్రుల పందిరిలో కనకదుర్గమ్మ అమ్మవారు మహాచండి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు విశేష పూజలు నిర్వహించారు. తిరుపతమ్మ అమ్మవారి ఆలయంలో ఉత్సవాల్లో భాగంగా కుంకుమార్చన నిర్వహించారు. అలాగే శ్రీస్వయంభు శంభులింగేశ్వరస్వామి ఆలయం. నవాబుపేట, ముండ్లపాడు గ్రామాల్లో నిర్వహించిన పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వత్సవాయి: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఐదవరోజైన సోమవారం అమ్మవారు చండీశ్వరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామాల్లో ఏర్పాటుచేసిన అమ్మవారి విగ్రహాలను చండీశ్వరీగా అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దంపతులు పీటలపై కూర్చుని పూజాక్రతువులు జరిపించారు. సాయంత్రం సమయాల్లో మహిళలు విగ్రహాల వద్ద రంగు రంగు పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మలను ఒకచోట పేర్చి మహిళలంతా ఆడిపాడుతున్నారు.

శోభాయమానంగా దేవీ శరన్నవరాత్రులు

నందిగామ టౌన్: విజయదశమి పండుగ సందర్భంగా నిర్వహిస్తున్న దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు శోభాయమానంగా జరుగుతున్నాయి. మహోత్సవాల్లో భాగంగా సోమవారం మండలంలోని అంబారుపేట గ్రామంలో వేంచేసియున్న సత్యమ్మ అమ్మవారు లలితాత్రిపుర సుందరీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఈవో హరిగోపీనాథ్ పర్యవేక్షణలో అర్చకులు అమ్మవారికి విశేష పూజలు, చండీ సహిత రుద్రహోమం, ఖడ్గమాలార్చన, తదితర పూజలు నిర్వహించారు. పల్లగిరి గట్టుపై ఉన్న త్రిశక్తి పీఠంలో వేంచేసియున్న కనకదుర్గ, కనకమహాలక్ష్మీ, జ్ఞాన సరస్వతీ అమ్మవార్లను ఆలయ అర్చకులు లలితాత్రిపుర సుందరీ దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అదే విధంగా గోళ్లమూడి శంభులింగేశ్వర స్వామి, కూడలి సంగమేశ్వర స్వామి వారి ఆలయాలలోని పార్వతీ మాతకు విశేష పూజలు, ప్రత్యేక అర్చనలు చేశారు. పట్టణంలోని రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో శుకశ్యామలాంబ అమ్మవారు అన్నపూర్ణా దేవిగా, వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారు మహా చండీ దేవి, మరిడీ మహాలక్ష్మీ అమ్మవారు స్వర్ణ కవచాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మండలంలోని లింగాలపాడు గ్రామంలో వేంచేసియున్న లక్ష్మీపేరంటాళ్లు అమ్మవారిని అర్చకులు మహాచండీ దేవిగా అలంకరించి పూజలు చేశారు. చందర్లపాడుతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లోని దేవీ ఆలయాలలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఆయా గ్రామాల్లోని అమ్మవార్లను ఆలయ అర్చకులు లలితాత్రిపుర సుందరీ దేవి, అన్నపూర్ణా దేవి, చండీదేవిగా అలంకరించి విశేష పూజలు చేశారు. మహిళలు పాల్గొని బతుకమ్మలాటలాడారు.

వీరులపాడు: మండలంలోని అల్లూరు గ్రామంలో వేంచేసియున్న సీతారామచంద్ర సహిత మహాలక్ష్మీ అమ్మవారి ఆలయంలో వేంచేసియున్న అమ్మవారు సోమవారం భ్రమరాంబికా దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా ఆలయ అర్చకులు అమ్మవారిని, స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు, అర్చనలు, సామూహిక కుంకుమార్చన, తదితర పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు అల్లూరి భాస్కరరావు, అంజనీదేవి దంపతులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అదే విధంగా వెల్లంకి గ్రామంలో ఏర్పాటు చేసిన అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు, అర్చనలు, సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు.

జగ్గయ్యపేట: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గమ్మ అమ్మవారు భువనేశ్వరీ దేవి అలంకారంలో సోమవారం భక్తులకు దర్శనమిచ్చారు. ముక్త్యాల, వేదాద్రి, చిల్లకల్లు, తిరుమలగిరి, అనుమంచిపల్లి గ్రామాల్లోని శరన్నవరాత్రి సందర్భంగా ఏర్పాటు చేసిన మంటపాల్లో అమ్మవారిని భువనేశ్వరీ దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలోని మార్కండేయ స్వామి బజార్, విశ్వబ్రాహ్మణ బజార్, శివాలయం వద్ద ఏర్పాటు చేసిన విగ్రహాల వద్ద మహిళలు ప్రత్యేక పూజలు, కుంకుమ పూజలు నిర్వహించారు.



జగ్గయ్యపేటలోని శ్రీమహాలక్ష్మి అమ్మవారి వెండి దేవాలయంలో మహాచండీదేవి



ముక్త్యాలలో భువనేశ్వరీ దేవి అలంకారంలో భవానీ అమ్మవారు



దుర్గాపురంలోని దుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో అన్నపూర్ణదేవి అలంకరణ



కంచికచర్ల శివసాయిక్షేత్రంలో గాయత్రీదేవి



మహాలక్ష్మీ అమ్మవారి ఆలయంలో గజలక్ష్మీదేవి



పెనుగంచిప్రోలులో మహాచండీదేవి అలంకరణ




మక్కపేట ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో



లింగాలపాడు లక్ష్మీ పేరంటాళ్లు అమ్మవారు



అల్లూరులో భ్రమరాంబిక దేవి అలంకారంలో మహాలక్ష్మీ



రామలింగేశ్వర స్వామి లయంలో అన్నపూర్ణా దేవి



తిరుమలగిరిలో ప్రత్యేకాలంకరణలో దుర్గమ్మ అమ్మవారు

పట్టభద్రుల ఎమ్మెల్సీని కైవసం చేసుకోవాలి

నందిగామ టౌన్: పట్టభద్రుల టీడీపీ సీనియర్ నాయకుడు, ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను గెలిపించుకునేందుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య తెలిపారు. పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో ఉమ్మడి కృష్ణా–గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటితో కలిసి సోమవారం పార్టీ నాయకులు, కార్యకర్తలు, బూత్ ఇన్‌చార్జ్‌లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంతోనే ప్రజలకు మంచి జరుగుతుందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రథమ ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని కోరారు. ముందుగా ఆలపాటిని ఆమె సత్కరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ పరుచూరి అశోక్‌బాబు, పలువురు నాయకులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే సౌమ్య

ఎమ్మెల్సీగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజయం ఖాయం

జగ్గయ్యపేట అర్బన్: ఉమ్మడి కృష్ణా–గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్ (రాజా)ను అఖండ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) తెలిపారు. రాజేంద్రప్రసాద్ గెలుపును కోరుతూ సోమవారం స్థానిక ఉక్కు కళావేదికలో ఏర్పాటుచేసిన క్లస్టర్, యూనిట్, బూత్ కన్వీనర్లు, నియోజకవర్గ టీడీపీ ముఖ్య నాయకుల సమావేశంలో ఎమ్మెల్యే తాతయ్య ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ టీడీపీ వ్యవస్థాపకుడు దివంగత ఎన్టీ రామారావు నడయాడిన ప్రాంతంలో తాను ఎన్నికల్లో పోటీ చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, టీడీపీ పట్టణ, మండల అధ్యక్షుడు మేకా వెంకటేశ్వర్లు, కట్టా నరసింహారావు, పలువురు నాయకులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

డెప్యూటీ తహసీల్దార్‌గా మానస

కంచికచర్ల: డెప్యూటీ తహసీల్దార్‌గా మానస సోమవారం బదిలీపై వచ్చారు. మంగళవారం బాధ్యతలు చేపట్టనున్నారు. ఇప్పటివరకు డీటీగా పనిచేసిన షేక్ నాగుల్ మీరా గంపలగూడెం తహసీల్దార్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. మానస జీ కొండూరు తహసీల్దార్ కార్యాలయం నుంచి కంచికచర్లకు వచ్చారు.